

ఘనంగా ఆచార్య ఎన్‌జి రంగా జయంతి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక అగ్రికల్చర్ రీసెర్చ్ సంస్థ ఊటుకూరులో పద్మ విభూషణ్ ఆచార్య ఎన్‌జి రంగా 125వ జయంతి వేడుకలు ఎ ఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ కొర్రపాటి, సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌జి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జి రంగా జీవిత చరిత్ర, రైతుల కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ, చూపిన మార్గంలో నడయాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం నవంబర్ 7న ఆయన జయంతిని రైతు సంఘాలతో పాటు వివిధ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే కళారూపాలు

- మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులు చేయాలి
- ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ పిలుపు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజా సమస్యలపై కళారూపాలను ప్రదర్శించాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి మూడు రోజుల శిక్షణ శిబిరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కళ కళ కోసం కాదు – ప్రజల కోసం – ప్రగతి కోసం' అనే లక్ష్యంతో ప్రజానాట్యమండలి ప్రజలందరిని చైతన్యపరిచేటువంటి కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను, కష్టాలకు కారకులైన పాలకుల విధానాలను తేటతెల్లం చేస్తూ వారిని చైతన్యపరిచే కళారూపాలు ప్రజానాట్యమండలి రూపొందిస్తుందన్నారు. ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక ఉద్యమం కోసం ప్రజల్లో ఉన్న ఔత్సాహిక కళాకారులను, ప్రజల కోసం పనిచేసే ప్రజా కళాకారులుగా తీర్చిదిద్దే కార్యక్రమం ప్రజానాట్యమండలి చేపట్టిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. ఒకవైపు కార్పొరేట్ దోపిడీ మరొకవైపు మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తమై తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులకు అనేక కళా ప్రక్రియలలో నైపుణ్యం పెంచేందుకు, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో కొత్త కళారూపాల సృష్టికి అవసరమైన శిక్షణను ఇస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి కళాకారులు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా రచయిత జె.బాలచెన్నయ్య, ప్రజానాట్యమండలి నాయకులు సి.పి రమణ, ఎన్.హరికృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం : డిఎంహెచ్‌ఒ



కడప ఐటిఐ సర్కిల్ వద్ద మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా 'కేన్సర్ పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం' అనే నినాదంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచఒ మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవనశైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. బిపి, షుగర్ తోపాటు ఈ రోజుల్లో కేన్సర్ వ్యాధులు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. కేన్సర్ వ్యాధులు సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందని, ఆలస్యం చేయడం వల్ల నయం చేయలేని పరిస్థితిలో ఉంటాయని చెప్పారు. అధిక మరణాలు సంభవిస్తాయని ఈ పరిస్థితుల్లో రోగితోపాటు కుటుంబ ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు పైబడిన ప్రతి పౌరునికి ఉచితంగా నోటి, రొమ్ము గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ పరీక్షలు చేయించుకోవడానికి మీ ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని చెప్పారు. ర్యాలీ ఐటిఐ సర్కిల్ వరకు సాగింది. కార్యక్రమంలో ర్యాలీలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ వెంకటాచంద్రా రెడ్డి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్స్, డెమో భారతి, ఆరోగ్యశాఖ ఆఫీస్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. **తొండూరు :** స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తే అందుకు తగిన మందులు వాడి కేన్సర్‌పై విజయం సాధించవచ్చని డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కేన్సర్ పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ఈ పరీక్షలు చేస్తారని చెప్పారు. గుర్తించిన కేసులను జిల్లా కేంద్రంలోని ఆంకాలజీ యూనిట్‌కి రెఫర్ చేసి తొలి దశలోనే నయం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ మునాఫ్, స్టాఫ్ నర్స్ అనూష, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, నాగేశ్వరి మల్లెల, గ్రామ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **వేంపల్లె :** కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్గి ఉంటే సకాలంలో వ్యాధిని నయం చేసుకోవచ్చని డాక్టర్ సుభాషిణి పేర్కొన్నారు. జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెంచుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ శాంతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీచరణికి ఘన సత్కారం

కడప నగరంలో భారీ ర్యాలీ
దారిపొడవునా అభినందనల వెల్లువ



శ్రీచరణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి



శ్రీచరణి సన్మాన కార్యక్రమానికి హాజరైన క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి–కడప

దేశానికి మొట్ట మొదటి ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించి, కడప జిల్లా ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టి, మొట్టమొదటి సారిగా కడప జిల్లా వాసి నల్లపురెడ్డి శ్రీచరణికి కడపకు వచ్చిన సందర్భంగా నగర శివార్లలోని ఆలంఖాన్‌పల్లి వద్ద శుక్రవారం రాత్రి 7.30 గంటలకు ఆమెకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి రెడ్డిప్రసాద్, ఎసిఎ సౌత్ జోన్ కన్వీనర్ సంజయ్ కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, ముని కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఘనం స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ చేరుకుంది. నిర్వాహకులు ముందుగా సాయంత్రం 4 గంటలకు వస్తుందని ప్రకటించారు. రోడ్డు మార్గాన వస్తుండడంతో ఆలస్యం కావడంతో నిర్వాహకులు 6 గంటలకు వస్తుందని ప్రకటించారు. శ్రీచరణి రాక ఆలస్యమైనా పెద్ద ఎత్తున ప్రజలు ఆమె రాక కోసం ఎదురు చూశారు. రాత్రి 7.30 గంటలకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వైఎస్ఆర్ కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలకరించిన గుర్రాలు రథంలో శ్రీచరణిని కూర్చోబెట్టి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున క్రికెట్ క్రీడాకారులు, స్పోర్ట్స్ స్కూల్, వ్యాయామ కళాశాల, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు క్రికెట్ అభిమానులు, చిన్నా, పెద్ద తేడాలేకుండా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దారిపొడవున నిలబడి జాతీయ పతాకాలు, శ్రీచరణి ఫొటోతో కూడిన ప్లకార్డులు పట్టుకుని జేజేలు పలుకుతూ ర్యాలీలో పాల్గొని ఘనస్వాగతం పలికారు. క్రీడాభిమానులు దారిపొడవునా శ్రీచరణిపై పూల వర్షం కురిపించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ర్యాలీ పోస్టు ఆఫీసు సర్కిల్ నుండి ఏడు రోడ్ల సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా రాజీవ్‌మార్గ్ వరకు సాగింది. ర్యాలీలో జాతీయ గీతాలు, భారత్ మాతకు జై అంటూ నినాదాలు, బాణాసంచా, వాయిద్యాలతో నగరం మార్మోగింది. అనంతరం ఎసిఎ క్రికెట్ స్టేడియంలో శ్రీచరణీని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో మేయర్ ముంతాజ్‌బేగం, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, శ్రీచరణి తల్లిదండ్రులు చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక, క్రీడాకారులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీలో శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులు



శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న జిల్లా క్రికెట్ అసోషియేషన్ సభ్యులు



తల్లిదండ్రులు, సోదరితో శ్రీచరణి

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. శుక్రవారం కడప చేనేత జౌళి శాఖ అధికారి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందింది పరిశ్రమ అన్నారు. కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా చేనేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేత నెత్తిన జిఎస్‌టి భారం వేయటంతో చేనేతరంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇస్తున్న నేతన్న నేస్తం పథకం కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని తెలిపారు. బడ్జెట్‌లో చేనేతలకు కేటాయింపులు లేవని వాపోయారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని చెప్పారు. ప్రస్తుతం మొంథా తుపాను కారణంగా చేనేత కార్మికులు చాలా నష్టపోయారన్నారు. చేనేత కార్మికులకు ముద్ర రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176 కోట్ల వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఇళ్ల కోసం ఇచ్చిన రుణాల రద్దుచేసి వారి ఇంటి పట్టా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు సహకార సంఘాల బకాయిలు రద్దు చేయాలని కోరారు.. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, చంటి, నారాయణ, గోపాల్, రాజు, సూర్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైసిపి ప్రభుత్వం ఖజానా నుంచి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయకపోగా కోటి సంతకాలు అంటూ ఆ పార్టీ నాయకులు మెడికల్ కళాశాలల సాకుతో రాష్ట్ర మంతటా అసత్య ప్రచారాలు చేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ సమీపంలోని మన్సూరు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలో రూ. 975 కోట్లు, పీజీ విద్యార్థుల వసతుల నిర్మాణాలకు రూ.700 కోట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. పీజీ విద్యార్థుల నిధుల నుంచి రూ.451 దారి మళ్లించి రూ.1451 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే నిర్మాణం చేపట్టారని తెలిపారు. 17 మెడికల్ కళాశాలలు ప్రభుత్వం ద్వారా పూర్తి కావాలంటే రూ. 7000 కోట్లు నిధులు, పదేళ్ల సమయం పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిపిపి విధానం అంటే ప్రయవేట్ పరం కాదని, 33 సంవత్సరాలు లీజ్ మాత్రమే నని చెప్పారు. ఈ విధానం ద్వారా 2026 ఏడాదిలోగా 11 మెడికల్ కళాశాలలు వినియోగంలోకి వస్తాయని పేర్కొన్నారు. వైసిపి కావాలనే ప్రజల్లోకి రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో 28 మెడికల్ కళాశాలలు నిర్మించారని పేర్కొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

ప్రజాశక్తి- కలసపాడు

మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన గంగసాని బాల వెంకట్ రెడ్డి, బాల సుబ్బమ్మ కుమారుడు శ్రీకాంత్ రెడ్డి, ఊహ ప్రత్యుషల వివాహ వేడుకకు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆమెతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాధనకారి రంతు, టిడిపి మండల అధ్యక్షులు గోపవరం వెంకటరామిరెడ్డి, అప్పర్ సిగిలేరు ప్రాజెక్టు చైర్మన్ పట్టాభి రెడ్డి, మన్యం మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్‌పిటిసి నందిగారి వెంకటసుబ్బారెడ్డి, తెల్లపాడు రోసిరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి వివాహానికి హాజరై వారికి వధూవరులకు అభినందనలు తెలిపారు.



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

జిజిహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - కడపసిటీ



రోగితో వైద్య సిబ్బంది, సూపరింటెండెంట్

జిజిహెచ్‌లో ఓరోగికి కుడి భుజపు ఎముక భాగంలో వచ్చిన కాన్డ్రో సార్కోమా అనే కేన్సర్ వ్యాధికి అరుదైన, క్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించామని జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టిక్ ఆఫ్ లిస్బగ్ పద్ధతి ద్వారా కేన్సర్ గడ్డతోపాటు పూర్తిగా స్కాపులా ఎముక, డిస్టాల్ క్రానికల్, ప్రోగ్జిమల్ హెూమరస్ తొలగించి చేతిని కాపాడామని చెప్పారు. ఈ పద్ధతి ద్వారా రోగి భోజనం చేసేందుకు చేయి పనితీరును మెరుగుపరచామన్నారు. ముందుగా చేతిని పూర్తిగా తొలగించాలనుకున్నామని, తరువాత భుజాన్ని కాపాడే శస్త్ర చికిత్సగా మార్చి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రముఖ కేన్సర్ శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రమానుల్లా ఆధ్వర్యంలో ఆపరేషన్ జరిగిందన్నారు. రోగి పూర్తిగా కోలుకునే దశలో ఉన్నారని తెలిపారు. చికిత్సలో డాక్టర్ సునీల్ అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ ఫరూక్, అనస్తీసియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నగేష్, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కావ్య, ప్లాస్టిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్‌తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. చికిత్సలో పాల్గొన్న వైద్యులకు సిబ్బందికి సూపరింటెండెంట్, సిఎస్ ఆర్ఎంఒవై శ్రీనివాసులు అభినందించారు.

రిమ్స్‌లో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి శుక్రవారం రిమ్స్‌ను సందర్శించారు. రిమ్స్‌లో నీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అక్కడి అధికారులతో చర్చించారు. కార్పొరేషన్ నుంచి ఎంత మొత్తం నీటి వస్తుందని ఆరా తీశారు. ఎంత నీరు వాడుతున్నారు, రిదంత వైద్యశాల వారికి ఎంత నీరు సరఫరా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యను త్వరలో పరిస్కారం చూపిస్తామని కమిషనర్ చెప్పారు.

'పద్మావతి' కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయలసీమ వ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులకు పద్మావతి శానిటేషన్ సర్వీసెస్‌కు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించిందని, వయోపరిమితి పేరుతో కార్మికులను, విద్యా అర్హత పేరుతో సూపర్‌వైజర్లను తొలగించడం అన్యాయమని, వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి పి. వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రులలో పారిశుధ్యం మెరుగ్గా చేయాలనే ఉద్దేశంతో టెండర్ పిలిచి వారికి బాధ్యతలు ఇచ్చారని పేర్కొన్నారు. పద్మావతి కాంట్రాక్ట్ వారు పారిశుధ్యం మీద శ్రద్ధ పెట్టకుండా వయోపరిమితి పేరుతో కార్మికులను ఎలా తొలగించాలనే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కడప మెడికల్ కళాశాలలో, జిజిహెచ్ క్యాంపస్‌లో శానిటేషన్ తరపున తాము ఇన్‌ఛార్జులమని చెప్పు కుంటున్న వెంకటరెడ్డి, సురేష్ కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడమే సరికాదన్నారు. ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్మిక హక్కులు కాల రాస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆర్‌టిసి. డ్రైవర్లకు 'రోడ్డు ప్రమాదాలు.. నివారణ' అనే అంశంపై ఆర్‌ఎం కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కడప ట్రాఫిక్ సిఐ డి.కె జావీద్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణం అన్నారు. ఒక బస్సు లో సుమారు 40 నుంచి 50 మంది ప్రయాణికుల ప్రాణాలు ఒక డ్రైవర్ చేతిలోనే ఉంటాయని పేర్కొన్నారు. డ్రైవర్ ఎల్లప్పుడూ జాగ్రత్తగా బస్సును నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయకూడదన్నారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడపటం ప్రమాదకరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత, అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి రూ 4.50 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో రోడ్ల పనులు చేపట్టేందుకు జాతీయ ఉపాధి హామీ చట్టం కింద దాదాపు రూ 4. 50 కోట్లు నిధులు మంజూరు అయినట్లు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో రోడ్లన్నీ విధ్వంసం చేశామని చెప్పారు. రోడ్లన్నీ విధ్వంసం కావడంతో ప్రతి వీధిలోనూ పజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన రోడ్లులను పునర్నిర్మాణం చేసేందుకు పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి మండల పరిశీలకులు రఘునాథరెడ్డి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఉపాధి కింద రూ. 4.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని చెప్పారు. వేంపల్లెలో ఏ ప్రాంతం చూసినా రోడ్లన్నీ పెద్ద, పెద్ద గొయ్యిగా మారి పోయినట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో అర్థాంతరంగా ఆగిన పనులను తిరిగి చేపట్టేఃదుకు కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు రూ.11 కోట్ల బిల్లులు మంజూరు చేసిందన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాదాపు 5.50 కోట్లు నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను పూర్తి చేయి స్తున్నట్లు చెప్పారు. సమా వేశంలో టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి, తక్కెల షరీఫ్, వేణు గోపాల్ రెడ్డి, అహమ్మద్ అలీ(సెట్), శ్రీనువాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్కాట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్ : శంకరాపురంలో భారత స్కాట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్. షంషుద్దీన్ ఆదేశాల మేరకు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ రమణయ్య, స్కాట్ కమిషనర్ గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 75 వ సంవత్సర భారత స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్కాట్ ఫౌండర్ బెడెన్ పవెల్‌కు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఒసి రమణయ్య, స్కాట్ కమిషనర్ డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు శివ ప్రసాద్, అమర్నాథ్ బాబు, సీనియర్ స్కాట్ మాస్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, శ్రీ హరి డిగ్రీ కళాశాల రోవర్స్, కెజిబివి గైడ్స్, యూనిట్ లీడర్సు పాల్గొని జయప్రదం చేశారు.

పరిశోధక పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప : సింఫోని ఆఫ్ ఇంటిగ్రేటెడ్ బయాలజీ అండ్ ఫార్మాసిటికల్స్ సైన్సెస్ పరిశోధక పుస్తకం పరిశోధకులకు, విద్యా ర్థులకు చాలా ఉపయో గకరంగా ఉంటుందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. అంతర్జాతీయ సదస్సులో భాగంగా సింఫోని ఆఫ్ ఇంటిగ్రేటెడ్ బయాలజీ అండ్ ఫార్మసిటికల్స్ సైన్సెస్ పరిశోధక పుస్తకం శుక్రవారం ఆవిష్క రించారు. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కన్వీనర్‌గా డాక్టర్ డి. వీర నాగేంద్ర కుమార్ వ్యవహరించి నటువంటి అంతర్జాతీయ సమావేశానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 70కి పైగా పరిశోధక వ్యాసాలను పరిశోధకులు సమర్పించారని ప్రిన్సిపల్ చెప్పారు. పుస్తకం ప్రచురణలో ఎడిటర్స్‌గా జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ మహేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రవి శేఖర్, డాక్టర్ సావిత్రి, నవనీశ్వర్ రెడ్డి, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్

దేశభక్తి స్ఫూర్తి మంత్రం 'వందేమాతరం'

ప్రజాశక్తి - కడప



ప్రతిజ్ఞ చేస్తున్న కెఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థులు, సిబ్బంది

యావత్ భారతావనిలో దేశభక్తిని నింపే స్ఫూర్తి మంత్రం వందేమాతర గేయమని జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి పేర్కొన్నారు. వందేమాతరం గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో శుక్రవారం 'వందేమాతరం' సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారితోపాటు గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉదయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కాలంలో కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపిందన్నారు. అనంతరం అందరూ వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపధికల్పన అధికారి సురేష్ కుమార్, ఎఒ విజయ్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** వందేమాతరం గీతం రచించి 150 సంవత్సారాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా కెఎస్ఆర్ఎం కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక గేయాలాపన నిర్వహించారు. కళాశాల విద్యార్థులు దాదాపు 1200 మంది, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ టి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయం బంగా దర్శన్ సాహిత్య పత్రిక ద్వారా 1857లో వెలువడిందన్నారు. తదుపరి ఆ గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ మొట్టమొదటి సారిగా 1896లో ఆలపించారని తెలిపారు. వందే మాతర గీతం స్వరాజ్యం, స్వదేశీ, సమైక్యత అనే అంచాంచలమైన దేశ భక్తి రగిలించిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.వంశీ నాయక్, టి.నారాయణ తెలిపారు. కార్యక్రమం ఐ క్యూ ఎసి డీన్ డాక్టర్ విజయ కిషోర్, డీన్లు, వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల అటానమస్ ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో వందే మాతర గీతానికి 150 సంవత్సరాలైన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అర్కాటవేముల హరి నారాయణ, కళాశాల కో–ఆర్డినేటర్ గౌరీశంకర్, డైరెక్టర్ పృథ్వి నారాయణ, ప్రిన్సిపల్ శారద భవాని, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామ్మోహన్, మౌనయ చారి ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, ఎన్‌సిసి ఇన్‌స్ట్రక్చర్ దావీదు, కళాశాల అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** స్థానిక గండి రోడ్డులో ఉన్న నారాయణ విద్యాసంస్థల్లో వందేమాతరం గేయాలోపన కార్యక్రమం చేపట్టారు. బంకించంద్ర చటర్జీ రాసిన భారత జాతీయ గేయం వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం నారాయణ విద్యాసంస్థల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి హజరైనారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ విజయ్ కుమార్, యాస్మిన్, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

చిరు వ్యాపారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

చిరు వ్యాపారుల అభివృద్ధికి ప్రభుత్వం తమ వంతు కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న శ్రీ శక్తి భవన్‌లో మెప్మా ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు ప్రధానమంత్రి ఆత్మ నిర్భంధ పథకం కింద చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ప్రభుత్వం రుణాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. చిరు వ్యాపారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలన్నారు. 772 మంది చిరు వ్యాపారులకు రూ.2.01 కోట్ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మెప్మా అధికారులు, వేతన కమిటీ రాష్ట్ర డైరెక్టర్ దాసరి బాబు, కౌన్సిలర్ కుర్రా రాధాక్రిష్ణ, టిడిపి నాయకులు శ్రీనివాసులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల ప్రహరీ

పాఠశాల ప్రహరీ ఇలా.. ప్రమాదాలు జరిగితే ఎలా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చుచేసి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నా పాఠశాలల రూపురేఖలు మాత్రం మారడం లేదు. నాడు- నేడు పథకం కింద కొన్ని పాఠశాలలను అభివృద్ధి చేయగా, మరికొన్ని పాఠశాలలు అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదు. వివరాలు.. మండల పరిధిలోని పత్తూరు దళితవాడ ప్రభుత్వ పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాల చుట్టూ మురుగు పెద్ద ఎత్తున తాండవిస్తోంది. మురుగు ప్రవాహంతో పాటు వర్షాకాలం, పరిసర ప్రాంతాల్లోని పొలాలలోని నీరంతా పాఠశాల ముంగిట నుంచే ప్రవహిస్తుండంతో ప్రహరీ దెబ్బతింటోంది. నీటి ప్రవాహానికి గోడలు నాని నెర్రెలు వారుతున్నాయి. ప్రహరీ కూలిపోయే స్థితిలోకి చేరింది. విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. విద్యాశాఖ ఉన్నత అధికారులు, ప్రభుత్వం స్పందించి పరమతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పశువైద్యశాలలో జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని పశు వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కడప జెడి డాక్టర్ ఎన్.ఎ. శ్రీనివాసులు, ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అక్కడి సిబ్బందికి, వైద్యులకు సూచనలు, సలహాలిచ్చారు. ఏ సీజన్‌లో పశువులకు ఎలాంటి జబ్బులు వచ్చినా రైతులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి పశువులకు సంబంధించి దాన ఇతర ఏవైనా సబ్సిడీలు వస్తే రైతులు అందరికీ తెలియజేసి పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట కడప డిడి డాక్టర్ శ్రీధర్ లింగా రెడ్డి, పోరుమామిళ్ల ఏడీ డాక్టర్. చంద్రశేఖర్ నరసాపురం పశువైద్యాధికారి డాక్టర్ సి రామారావు ఉన్నారు.

సాటివారికి సేవ చేయడంలోనే మానవత్వం

ప్రజాశక్తి - జమ్మలమడుగు : సాటి వారికి సేవ చేయడంలోనే మానవత్వం ఉంటుందని ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామంలో గుద్దేటి నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ కలిసి వృద్ధులకు ఊత కర్రలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అన్న సూక్తితో నరసింహారెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. గుండ్లకుంట గ్రామంలోని హైస్కూల్ భవనాలకు మరమ్మతులు చేయాలని, అందుకు నరసింహారెడ్డిని కొంత ఆర్థిక సాయం చేయవలసిందిగా కోరారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, పేదలకు వైద్యం చేయించడంలో ముందున్న నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో శివశంకర్ రెడ్డి, విశ్రాంతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి, వాసుదేవరెడ్డి, మాధవ గోపాల్ రెడ్డి, పాపయ్య, నేసా రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుల దూషణకు మూడేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో బంగ్లా రమేష్ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించారని కడప ఎస్సి, ఎస్టి ఫోర్ ఎడిజె కోర్టు శుక్రవారం ఇద్దరి ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. పోలీసుల వివరాల మేరకు.. ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగించే రమేష్ అనే వ్యక్తి మహమ్మద్ గౌస్ వద్ద పనికి వెళ్లేందుకు కొంత డబ్బును అడ్వాన్స్‌గా తీసుకున్నారు. పనికి వెళ్లకపోవడంతో గౌస్‌తోపాటు ఖాసీం ఇద్దరూ 2019 అక్టోబర్‌లో రమేష్ ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించి, అతన్ని కొట్టారు. అప్పట్లో రమేష్ వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో న్యాయమూర్తి దినబాబు సాక్షులను విచారించి నేరం రోజువు కావడంతో ముద్దాయిలకు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. సకాలంలో ముద్దాయిలను కోర్టుకు పరిచి శిక్ష పడేందుకు కారణమైన డిఎస్‌పి వెంకటేశ్వరరావును, సిఐ విశ్వనాథరెడ్డిని, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, బాషాను ఎస్‌పి అభినందించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణ సమీపంలో ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్.వి. కల్యాణ మండపం వద్ద ఎదురెదురుగా వస్తున్న లారీలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక లారీలో ఉన్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆర్‌టిపిపి నుంచి పొట్లదుర్తి మీదుగా ఫ్లైయాష్ లోడుతో ఎర్రగుంట్ల వైపు ట్యాంకరు బయలుదేరింది. అ ఎస్.వి. కల్యాణ మండపం వద్దకు రాగానే అదే సమయంలో హాస్‌పేట్ నుంచి నెల్లూరు కృష్ణపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఎర్రమట్టి లోడుతో వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో లారీలో ఉన్న డోను పట్టణానికి చెందిన డ్రైవర్ మృత్యుంజయుడు కాలు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేబిన్‌లో ఇరుకున్న డ్రైవర్‌ను జెసిబి సాయంతో వెలికి తీశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రక్

ప్రజాశక్తి - గోపవరం

బి.కోడూరు మండలంలోని మేకవారిపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ ట్రక్కు ప్రమాదానికి గురైంది. ఓవర్ స్పీడ్‌లో ప్రయాణిస్తుండగా డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లి ట్రక్కుపై నియంత్రణ కోల్పోయాడు. ఫలితంగా ట్రక్కు రహదారిని వదిలి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. పెద్ద ప్రమాదం తప్పడంతో డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నాడు. అయితే భయంతో ట్రక్కును అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

బాలికలను రక్షిద్దాం..చదివిద్దాం

ప్రజాశక్తి-చక్రాయపేట

బాలికలను రక్షించండి.. చదివించండి అని సిడిపిఒ వి.సునీత పేర్కొన్నారు. శుక్రవారం దేవరగుట్టుపల్లె ఎంపిపి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ విజయ కుమారి, ఎంఇఒ- 2 రవి కిరణ్, డిప్యూటీ ఎంపిడిఒ విజయ్ కుమార్ నాయక్, వెలుగు సిసి రామాంజనేయులు, మహిళా పోలీసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఒ సునీత మాట్లాడుతూ చాలా మంది పేదరికం కారణంగా చదువును మధ్యలో మానేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులతో చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఆడపిల్లల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఆడపిల్లల నిష్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాలను ప్రకటిస్తోందని చెప్పారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధకానికి సమాచారం అందించాలన్నారు. బాలల హెల్ప్ లైన్ నెంబర్ 1098, మహిళల హెల్ప్ లైన్ నెంబర్ 155 ద్వారా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు గ్రామంలోని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారని చెప్పారు. బాలిక అభ్యున్నతికి దేశ ప్రగతి అని పేర్కొన్నారు. తహశీల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల కట్టుదిట్టమైన చట్టాలు ఉన్నాయని, ఎవరూ ప్రోత్సహించరాదని చెప్పారు. కార్యక్రమంలో సురభి,చక్రాయపేట, కుప్పం సూపర్‌వైజర్లు శ్రావణి, నాగ సుభాషిని, భారతి, అంగనవాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు. **చాపాడు :** ఆడపిల్లల్ని రక్షిద్దాం, ఆడపిల్లల్ని చదివిద్దాం అని ఎంపిడిఒ వీరకిషోర్, తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. శుక్రవారం మండల సభా భవనంలో బేటి బచావో – బేటి పడావో కార్యక్రమం సిడిపిఒ ముంతాజ్ బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, తహశీల్దార్లు మాట్లాడుతూ బాలికల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని, బాగా చదువుకొని మంచి ఉన్నత స్థానంలో ఉండాలా చూడాలని చెప్పారు.ఆడపిల్లల సంఖ్య తగ్గకుండా చూసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టరీత్యా నేరం అన్నారు. గ్రామాలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎవరైనా మహిళల ఇబ్బందులు పట్ల నిర్లక్ష్యంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 1098 కాల్ సెంటంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం బాలికల సంరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఒ హరినాథ్, సూపర్‌వైజర్ సుభరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.


చక్రాయపేట : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మోతాదులోనే రసాయన ఎరువులను వాడాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కడప సిటీ

రసాయనిక ఎరువులను తగిన మోతాదులోనే వినియోగించాలని కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన భూ రక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఫర్టిలైజర్ డీలర్లు బాధ్యతగా ఎరువులు, పురుగుమందులు వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎడిఎ లక్ష్మి మాధవి మాట్లాడుతూ భూ రక్షణకు ప్రకృతి వ్యవసాయం ఆచారించాలని, గ్రామస్థాయిలో డిమాంస్ట్రేషన్స్ ఏర్పాటు చేసి రైతులుకు అవగాహనా కల్పించాలని చెప్పారు. ఎరువులు విచక్షణ రహితంగా వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను రైతులకు తెలియజేసి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అధికంగా ఎరువులు వాడే రైతులను గుర్తించి ఎరువులు వాడకం పైన అవగాహన కల్పించి నేల ఆరోగ్యాని కాపాడాలని తెలియజేశారు. డిఎల్‌సిఒ గోపికృష్ణ మాట్లాడుతూ విచక్షణ రహితంగా పురుగు మందులు వాడటం వల్ల కేన్సర్ వంటి జబ్బులు వచ్చే ఆస్కారముందని, ప్రతి రైతూ ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కడప డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎరువుల డీలర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. ముద్దనూరులోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి భూ మాత రక్షణ ఎరువుల వాడకంపై ముద్దనూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు వివరించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం అవుతుందని చెప్పారు. సహజ సిద్ధమైన పద్దతిలో పంటలు సాగు చేస్తే భూమి సారవంతం పెరిగి ఆరోగ్యవంతమైన దిగుబడులు లభిస్తాయన్నారు. భూ మాత సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రామాంజిరెడ్డి, రాజు, టెక్నికల్ ఎఒ మధుసూదనరెడ్డి, బిటియం రవికుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ఆనాథవృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వహకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. వేంపల్లెకు చెందిన జర్నలిస్టు శివకేశవరెడ్డి తండ్రి బండ్లపల్లె పుల్లారెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా అమ్మ అనాథ వృద్ధ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దీంతో ఆశ్రమంలో ఉన్న అనాథ వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌తో పాటు అన్నదానం చేశారు. తన తండ్రి జాపకార్థం అనాథ వృద్ధులకు అన్నదానం చేపట్టినట్లు చెప్పారు. పిల్లల ప్రేమను కోల్పోయిన వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని చెప్పారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో బండ్లపల్లె చెన్నకేశవరెడ్డి, కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు తక్కెల షరీఫ్, మారుతి, డక్కా రమేష్ దేరంగుల బాబు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకుని నియోజక వర్గంలోని ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సింగం శివమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ సాయిశ్రీ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన పంటలను అధికారులు ప్రాథమిక అంచనా వేసి వెంటనే బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. వరి, మినుము, కంది, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, నువ్వు, ఉద్యాన పంటలైన ఉల్లి, మిరప, టమోటా లాంటి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు.గత ప్రభుత్వం పంటలకు బీమా ప్రీమియం మొత్తం చెల్లిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులే ప్రీమియం చెల్లించారన్నారు. అలాంటి రైతులకు వందశాతం నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద నష్టాన్ని అంచనా వేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎప్పుడు అంచనా వేస్తారో అప్పుడే నష్టపరిహారం బాధితులకు ఇవ్వాలన్నారు. ఇకనైనా ప్రాథమిక అంచనా తీసుకొని బాధితులకు వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలి. నష్టపోయిన రైతులకు వందశాతం సబ్సిడీతో విత్తనాలు ఎరువులు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని రాజుపాలెంలో మల్లువారిపల్లె గ్రామ రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 1లో ఉన్న వంద ఎకరాల ప్రభుత్వం భూమిలో గ్రామంలోని పేద, వ్యవసాయ కూలీలు, బడుగు, బలహీన వర్గాల వారు వంద ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలివ్వాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పామూరి బాలిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తహశీల్దార్ మధురవాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంపి 85, 65, 56లో భూమికి సంబంధించి ఇటీవల సుమారు 30 మంది పేద రైతులకు ఇచ్చారని పేర్కొన్నారు. అందుకు సంబంధించి తాము వ్యక్తిగతంగా వచ్చామని, పేదలకు భూమిని చదును చేసి బోర్లు వేసి , విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, తమరు క్షేత్రస్థాయిలో విచారించి వాస్తవ పరిస్థితులు పట్టాలు ఇప్పించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రంగనాయకులు, బాల గురయ్యా, పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య, శ్రీనివాసులురెడ్డి, షేక్ నన్నే సాబ్, బత్తుల దేవరాజు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సింహాద్రిపురంలోని గురజాల క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ బాల బాలికలకు తమ వాహనాలను ఇవ్వకూడదన్నారు. అతివేగం ప్రమాదకరమని ఆయన సూచించారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : మాదకద్రవ్యాలు, సైబర్ క్రైం నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి వెంకటేశ్వర రావు సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డిఎస్‌పి మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా పటిష్టమైన గస్తీ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.


సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన గ్రీవెన్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వాటిని వివరించి పరిష్కరించాలని కోరారు. అనంతరం మైలవరం మండలం దన్నవాడకు చెందిన పెద్దపాపిరెడ్డి సీనియర్ నాయకులు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును వారి కుటుంబానికి అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కడప

కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈనెల 8న కడప నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కడప టౌన్-2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.లక్ష్మా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్‌టిసి బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని కడప టౌన్ 2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. లక్ష్మా నాయక్ తెలియజేశారు. వినియోగదారులకు కలిగే ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. **తొండూరు :** స్థానిక తొండూరు పట్టణంలో ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫ రాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ బాలా సంజీవులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. మల్లెలలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్‌లో, తొండూరు, బద్రంపల్లెలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ ఫీడర్స్‌లో లైన్ మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - తొండూరు

ప్రతి శుక్రవారం డ్రైడే తప్పనిసరిగా పాటించాలని స్థానిక సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. నిల్వ నీటిలో లార్వా నిర్మూలన కోసం అబిట్ పిచికారి చేసి, ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే నిర్వహించామని చెప్పారు. ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వలు ఉండకుండా చూసుకోవడం, దోమల పెరుగుదల నివారణకు పాటించా ల్సిన చర్యల గురించి ప్రజలకు సూచించారు. రాత్రి పూట తప్పని సరిగా దోమతెరాలు వాడాలి పేర్కొన్నారు.. కార్యక్ర మంలో ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరీ ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

చౌటపల్లి ఎడ్లకు మొదటి బహుమతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లెలో కొండయ్య స్వామి జన్మదిన వేడుకలలో భాగంగా శుక్రవారం సీనియర్ విభాగం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్ రెడ్డి ఎద్దులు 3051.09 అడుగులు లాగి మొదటి బహుమతి రూ. 1 లక్ష గెలుచుకున్నాయి. రెండవ బహుమతి కల్లూరుకు చెందిన పెరుమాళ్ళ శివకృష్ణయదవ్ ఎద్దులు 3007.08 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.70వేలు కైవసం చేసుకున్నాయి. బాపట్ల వెటపాలెంకు చెందిన ఆత్తోట శిరీషచౌదరి, శివ కృష్ణచౌదరి ఎద్దులు 2973 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. నాల్గవ బహుమతిని నంద్యాల జిల్లా కొత్తూరు బీరం కేదార్ శర్వణరెడ్డి ఎద్దులు 2800 అడుగులు లాగి కైవసం చేసుకున్నాయి. బండలాగుడు పోటీలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బండలా గుడు పోటీలలో వ్యాఖ్యాతగా గంగారు చంద్రమోహన్ రెడ్డి వ్యవహరించారు.


బండలాడుగు పోటీల్లో పాల్గొన్న ఎద్దు